# బొమ్మల రాణి

ఆ రాత్రి తోలుబొమ్మలాట. ఎనిమిది గంటలయ్యేటప్పటికి పందిరి తయారయింది. ఊళ్ళో బట్టలషావుకార్లు తటవర్తివారినడిగి ఒక అరతాను కోరాముల్లు పట్టుకువచ్చి తెరకట్టారు. తెర అడుగున గట్టి తడకలు గట్టారు. ఆరు పెద్దమండిగల్లో శేరుశేరు ఆముదంపోసి ఇనుపకొంకెలలో పెట్టి తెర వెనకాల వేళ్ళాడతీశారు.

తొమ్మిదింటికి ఊళ్ళోవుండే పాటక జనులు, కాపులు, హరిజనులు మొదలగు యావన్మందీ వచ్చి తోలుబొమ్మల పందిరిముందర కూర్చున్నారు. తెరవెనుక దీపాలు వెలిగించారు. వెలిగించటంతోటే తెరమీద రాములవారు, లక్ష్మణస్వామి, హనుమంతుడు, జాంబవంతుడు, సుషేణుడు యింకా మూడు కోతులు యీ పక్కా ఆపక్కా చెట్లుకాక యెనిమిది విగ్రహాలున్నాయి.

దీపాలు వెలిగించడంతోటే "తొండము నేకదంతమును" ఆనే పద్యం చక్కని గొంతుకతో తెర అవతల ఒక వృద్ధ కంఠం ఆలాపించింది. ఒక వానరుని బొమ్మతీసి ఆ ప్రదేశంలో నాలుగు తాళాలు, మద్దెల, తారశ్రుతిలో, మోడోకాలంలో, చతుష్కళలో "విఘ్నరాజా సిద్ధి వినాయకా" అంటూ నాటరాగంలో, ఏడు గొంతుకులు లయగా కలిసి, హంగుచేస్తుండగా విఘ్నేశ్వరుని బొమ్మ ప్రవేశపెట్టించారు. 'తైతకధిమికిట' అని ఆ వినాయకుడు తాండవించిపోతున్నాడు. సభికుల హృదయాలు ఝుల్లు మన్నాయి. పాట అయిపోయింది. వెనకటి శ్రావ్యమైన వృద్ధకంఠం ఇలా పలికింది.

వినాయకో విఘ్నరాజో ద్వైమాతుర గణాధిపాః

ఇత్యమరః హేరంబ లంబోదర గజాననాః

*శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం*
*ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే.*

అని ఈలాగున ఈ రోజున మేము ఆడబోయేటటువంటి శ్రీమద్రామాయణంలో రామరావణ యుద్ధం, శ్రీరామ పట్టాభిషేకం అనే ఆట ప్రారంభించేముందు విఘ్నేశ్వరుని ప్రార్థించిన వారమగుతూ యింక చదువుల తల్లియైన సరస్వతీదేవిని ప్రత్యక్షం జేసుకుంటున్నాము.

"వీణా పుస్తకపాణి...." అనే శ్లోకం పాడుతూ విఘ్నేశ్వరుని విగ్రహాన్ని తీసి సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రవేశపెట్టారు. ఆమెను లాస్యగతిని నాట్యమాడించారు. చక్కని

పాటపాడారు. భాగవతాది గ్రంథాలలో సరస్వతీ దేవిమీద వున్న పద్యాలన్నీ చదివారు. సరస్వతీదేవి పటమున్నూ మాయమైంది. మళ్ళీ వెనకటి వానరవిగ్రహం వచ్చింది.

ఆ గుంపు చాల విద్వత్తుగల గుంపు. గుంపు పెద్ద వీరయ్య డెబ్బది ఏళ్ళవాడైనా కంఠం గంభీర మంద్రంలో తెల్లటి జీడిపప్పు పాకంలా మా తియ్యగా సాగుతుంది. మంచి విద్యావంతుడు. వాల్మీకి రామాయణం, భాస్కర రామాయణం, సంస్కృత మహాభారతం, నన్నయ్య, తిక్కన్న, ఎఱ్ఱాప్రగడల మహాభారతం అతనికి కంఠస్థం, మంచి నీళ్ళప్రాయం. అమరం అనర్గళధార. ఒక్కొక్క కథకు నాలుగైదు తోలుబొమ్మ యక్షగానాలు అద్భుతంగా వచ్చును. సంగీతశాస్త్రం ప్రసిద్ధికెక్కిన కోన సుబ్రహ్మణ్యశాస్త్రిగారి దగ్గిర నిరాఘాటంగా నేర్చుకున్నాడు.

అతని కుమారుడు విఠలుడూ, విఠలుని ఇద్దరు భార్యలు నాంచారీ, రుక్మిణీన్ని, విఠలుడి కొడుకు ఓబలయ్యా, వాడి తమ్ముడు బేట్రయ్య, విఠలుని కూతురు మీనాక్షి – ఈ ఏడుగురు ఆటలో పాల్గొనేజట్టు. తోలుబొమ్మలవాళ్ళు ఆచారం ప్రకారం మొగవాళ్ళూ, ఆడవాళ్ళూకూడా మద్దెల వాయించడం తిత్తివూదడం నేర్చుకోవాలి.

వీరయ్య గొంతు తొణకనన్నా తొణకదు. వీరయ్య కుమారునికీ, మనమలకీ, కోడళ్ళకీ, మనుమరాలికీ బొమ్మలు తయారుచేయడం వచ్చును. వీరయ్య తోలుబొమ్మల వాళ్ళందరిలోను శిల్పసార్వభౌముడు. వెంకటగిరి సంస్థానంలోను, కార్వేటినగర సంస్థానంలోను, గద్వాలు సంస్థానంలోను వీరయ్యకు మూడు బంగారపు కడియాలు బహుమతులు వచ్చాయి. విజయనగరం మహారాజుగారు నూటయాభై రూపాయల శాలువనూ, నూటపదహారు రూపాయలు రొఖ్ఖమునూ బహుమతి యిచ్చారు. నూజివీడుకోటలో వెండి జరీపగిడీ, అయిదుకాసుల కంఠహారం, దోసెడు రూపాయలు, ఒక ఎకరం ఈనాము యిచ్చారు.

## 2

**పూ**ర్వకాలంలో వీరయ్య సంపాదన దోసిళ్ళకొద్దీ ఉండేది. సత్తెనపల్లిలో పదియెకరాల మాగాణిభూమి కొనుక్కున్నాడు. అయిదారుచోట్ల నాలుగువేల రూపాయలు వడ్డీ వ్యాపారానికి వేసుకున్నాడు. నేడు తోలు బొమ్మల్ని ఆదరించేవాళ్ళు లేరు. మేరీఫిక్ ఫర్డు, గ్రేటాగార్బో, నాద్మాషీరరు, దగ్లను మొదలగువాళ్ళు గమ్మత్తులు చేసే యీ రోజుల్లో తోలుబొమ్మలను ఆదరించే వాళ్ళెవరు? ఐనా నాగరికత యింకా పూర్తిగా పాటకజనాన్ని ఆవహించలేదు. వాళ్ళని సరస్వతీమాత రక్షించాలి. తోలుబొమ్మలు చూసినా, యక్షగానాల్ని ఆదరించినా, బుర్రకథలవాళ్ళని, దేవరకథలవాళ్ళని, వీధి భాగవతుల్ని పోషించినా వాళ్ళేయింకా.

వీరయ్య జట్టంటే ఇప్పటికీ పూర్వకాలపు వాసనలు పూర్తిగా పోని విద్యావంతులకు గౌరవమే. ఈ రోజున కొంచెం ప్రొద్దుపోయినా పదిగంటలకు ఊళ్ళో వర్తకులు, కరణాలు, పండితులు ఓవరిసీయరు, స్కూళ్ళ యినస్పెక్టరు, రెవెన్యూ యినస్పెక్టరు మొదలగు ఉద్యోగులు, ఏమీ చేయకుండా ఊళ్ళో కూచొనియున్న కామేశ్వరరావు యం.ఏ.గారూ,

యావన్మందీ వచ్చి వాళ్ళకు వీలుగా ఏర్పరచిన పెద్ద కాపుగారి పెద్దరుగులమీద కూర్చున్నారు. చాపలమీద, దిండ్లూ, పరుపులూ, తివాసీలు అన్నీ వేయించాడు. కామేశ్వరరావు యం.ఏ., పెద్దకాపు దగ్గిరచుట్టం.

హనుమంతుడికి రాములవారు సుగ్రీవుణ్ణి తీసుకురావలసినదిగా ఆజ్ఞాపిస్తున్నారు. రాములవారు కుడిచేతిని మాత్రం కదుపుతున్నారు. 'అయితే, ఓయి మిత్రుడా, హనుమంతుడా'

"అవును స్వామీ ఊహుఁ."

*"కపి, ప్లవంగ, ప్లవంగ, శాఖామృగ, వలీముఖాః,*
*మర్కటో, వానరః కీశో వనౌకాః, ఇత్యమరః.*
*అట్టి మర్కట శ్రేష్ఠుడై ఉత్తముడైన సుగ్రీవుడు"*
*"చిత్తం రాఘవేంద్రా, శ్రీరామచంద్రా"*

"హనుమంతా, ఎందుకు నాకు ఆ సుగ్రీవుడు కనబడుతున్న వాడవనుకుంటూ ఉండలేదేమోయి?"

"ఓహో రామచంద్రా దశరథపుత్రా, నేను తప్పకుండా సుగ్రీవ మహారాజు ఏమిచేస్తున్నాడో చూసివస్తున్నాను రాఘవేంద్రా"

హనుమంతుడు దేహమంతా కదుపుతూ శిరస్సు శ్రీరామచంద్రుని పాదాలకడ ఉంచుతూ ఆడిపోతున్నాడు. ఓ పక్కన ఉన్న బొమ్మలు తీసేసి, అక్కడ సుగ్రీవుడు, తారాదేవి. ఇద్దరు చెలికత్తెల విగ్రహాల్ని ప్రవేశ పెట్టారు. సుగ్రీవుడు తారాదేవితో నర్మ సంభాషణలు చేస్తున్నాడు. ఇంతలో తారాదేవి భర్తకు జవాబు చెపుతూ ఒక పాట యెత్తుకుంది. ఆ గొంతుక కిన్నరీ మాధుర్యము, సమ్మోహన పూరితము, కాకలీ మృదులోలితము.

ఆపాట వింటూనే సభంతా నిశ్శబ్దం అయిపోయింది. పండిత పామరుల యావన్మందీ హృదయాలూ ఆనందంచే ద్రవించిపోయాయి. ఆ గాన ప్రవాహము సుళ్ళుచుట్టి సెలయేళ్ళయి ప్రవహించింది.

పెద్దకాపుగారి అరుగుమీద గోడకు జార్లాబడి, ఒయ్యారంగా సిగరెట్టు కాల్చుకుంటూ యేదో ఆలోచిస్తూన్న కామేశ్వరరావు గబుక్కున లేచి కూచుని బొమ్మల తెరవంక చూశాడు. ఏమిటా ఆ గొంతుక? అని అనుకున్నాడు. వింటూన్నట్టు, విననట్టూ, కునికినట్టు కునకనట్టూ కూచుని ఉన్న గాయక శ్రేష్ఠుడు సీతారామయ్యగారు ఉలిక్కిపడి, అతి శ్రద్ధతో పాట ఆలకించడం మొదలెట్టాడు. ఆ కంఠము అతి తియ్యటిది. శరీరములో గంభీరత ఉంది. స్వాధీన కంఠము, శ్రమలేదు. యెత్తుగడలో, గమకంలో ప్రకృతి జనితమైన వైచిత్ర్యముంది. ఆ బాలిక వీరయ్య కేమవుతుందో అనుకున్నాడు సీతారామయ్యగారు.

## 3

**గా**యకశ్రేష్ఠుడు సంగీతశాస్త్ర పండితోత్తముడు సీతారామయ్యగారు, భీమవరంలో తోలుబొమ్మలాట అయిన వారంరోజుల వెనక ఓ సాయంత్రం ఇంట్లోకూచొని ఫిడేలు

వాయించుకుంటున్నాడు. తన ఫిడేలు వాద్యం శ్రుతికాగా, వీధిలో తోలుతిత్తి శ్రుతిలో పంచమస్వరంలో చక్కనిపాట విన్నాడు. ఆయన ఫిడేలును క్రిందపెట్టి వీధిలోకి వెళ్ళాడు. ఒక బాలికా, ఒక ఆడమనిషి ముష్టికోసం వచ్చారు. పధ్నాలుగేళ్ళు యీడువున్న బాలిక పాడుతున్నది. నడిమి వయస్సుగల స్త్రీ తిత్తి ఊదుతున్నది. సీతారామయ్యగారు మొన్న తోలుబొమ్మలాటలో, ముచ్చటపడుతూవిన్న కంఠమే యిది.

"అమ్మాయీ! నీకు వీరయ్య ఏమౌతాడు?"

"మా తాతయ్యండి."

"ఈ మనిషెవరు?"

"మా అమ్మండి."

"నీకు సంగీతం ఎవరు నేర్పారు?"

"మా తాతయ్య నేర్పాడు సామీ."

"నీకు సంగీతం నేర్పితే నేర్చుకుంటావూ?"

తల్లి–"సామీ, అంత అదృష్టం మాకు పడుతుందాండీ?"

"అదృష్టానికేముందిలే. ఇటువంటి కంఠం క్రమమైన సాధన లేకపోతే దోహదంలేని పూలచెట్టులా ఉంటుంది. ఇలాంటి గొంతుకే నాచేతిలో పడితే, దీని ముందర కిన్నెరుల పాటలూ, మహతీ వీణా కూడా అపశ్రుతి స్వరాలు పలకొద్దూ. దీని కీగళ మెక్కడనుంచొచ్చిందీ?"

"మా తల్లి గొంతు ఇంతకన్న అందంగా ఉండేదండీ" అని నడిమి వయస్సు స్త్రీ బదులు చెప్పింది.

"నేను వీరయ్యతో మాట్లాడుతాను. అతన్ని ఒకసారి రేప్రొద్దున్న మా ఇంటికి పంపించు."

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. సీతారామయ్యగారి కా మధురమైన గొంతుక, ఆ రోజల్లా వినబడుతూనేవుంది.

మరునాడుదయమే వీరయ్యా, విఠలుడూ వచ్చారు. వీరయ్య ఎదుటి వాళ్ళకు గౌరవం ఇచ్చి తనకు గౌరవం తెచ్చుకునే రకం. ప్రపంచం యొక్క దాతృత్వంమీదే తాను ఆధారపడి ఉన్నప్పటికీ, వీరయ్య భట్రాజుకాదు. సీతారామయ్య గారి వంటి పండితోత్తముడు, సజ్జనుడు, ఉత్తమ గాయకుడు తన మనుమరాలికి సంగీతం నేర్పడంకన్న అదృష్టం ఇంకోటిలేదని తెలుసును. అయినప్పటికీ ఈ రోజుల్లో తనకువచ్చే ఆ కొద్ది రాబడీ తన మనుమరాలి గొంతుకవల్ల వస్తోంది. ఆ గొంతుకు వినబడకపోతే ఏ వూళ్ళోనూ అయిదు రూపాయలకన్న ఎక్కువ దొరకవాయను. సంగీతం నేర్చుకుంటే వచ్చే లాభం ఏమిటి? ఆటలకి ఎక్కువ డబ్బువస్తుందా? లేకపోతే తాను తన మనుమరాలిని వెంటపెట్టుకొని సభలు చేయిస్తాడా? పైగా పిల్లకి గర్వం హెచ్చైపోయి తరతరాలనించీ వస్తూవున్న ఈ పవిత్రమైన వృత్తిని భీమవరం ముటికి కాలువలోనో, నర్సాపురం గోదావరిలోనో కలిపేస్తే!

"స్వామీ తమరు శలవిచ్చింది ఎంతో సంతోషమైంది-కాని ఏమిచేసేది? వృత్తివాండ్లం. జట్టు కొద్దిమందే ఉంటిమి. ఈ కరువు దినాలలో మా రాబడి అంతా ఈ పిల్లదాని గొంతుకపైనే ఆధారపడి ఉంది స్వామీ!"

"ఓయి వెట్టివాడా, ఇప్పుడు కొంచెం కాలం మళ్ళుతోందోయ్. తోలు బొమ్మలు, వీధినాటకాలు మళ్ళీ దేశంలో ఉద్ధరింపబడతాయి. నాగరికత కలవాళ్ళే వీట్లను ఉద్ధరిస్తారు. అల్లాంటప్పుడు నీ మనమరాలు సంగీతం నేర్చుకుని ఉందంటే నీ జట్టుకు వచ్చే గౌరవం ఇంతా అంతా అనికాదు."

**వీరయ్య:** అదేమిటి స్వామీ, వీధినాటకాలు మూలబడ్డాయి కూచిపూడి భాగవతులు కూలిపోయారు. విప్రవినోదులు అయిపులేరు. సినీమాలు, నాటకాలు మఱి అదేంటిస్వామీ, ఏమిట్రా అబ్బాయి దానిపేరు. విప్రవినోదులుచేసే పనులు చేస్తారు?

**సీతా:** ఓ! మాజిక్కా!

**వీర:** అదో ఆదండి. అలాంటివన్నీ పెరిగిపొయ్యాయి.

**సీతా:** ఓయీ పిచ్చివాడా, పోనీ తోలుబొమ్మలు చచ్చిపోతాయే అనుకో. ఈ రోజుల్లో సంగీతం నేర్చుకున్న వాళ్ళకి డబ్బెక్కువ. సంగీత సభలు, సంగీత స్కూలు మేష్టర్లు, సంగీత గ్రామఫోనుప్లేట్లు, సంగీత సినీమాలు, ఆడవాళ్ళు నాటకాల్లో వేషాలు వేయడం. ఎక్కడ జూసినా సంగీతానికే యీ రోజుల్లో డబ్బు. అల్లాంటప్పుడు కాస్త గట్టిగా సంగీతం నేర్చుకుంటే మీ కుటుంబమునంతా అదే పోషించగలదు. గౌరవము సంగతి జెప్పక్కర్లేదు. యేవంటావోయ్ వితలయ్యా?

**విత:** నిజం, సామీ! మా అప్ప ముసలివాడు. వాడికేమి తెలుసు. మా అమ్మణ్ణి మీ దగ్గర వుంచుదురుసామీ.

వీరయ్య కూడా వొప్పుకున్నాడు.

## 4

**కా**మేశ్వరరావు యమ్.ఎ.గారికి సాలుకు వెయ్యి రూపాయలు వచ్చే ఆదాయం వుంది. ఏ వుద్యోగానికైనా ప్రయత్నించాలని వుంది. కాని ఇంటి దగ్గర తల్లితో ఒక తమ్ముడితో సంసారము పొదుపుగ, కాలక్షేపం చేసుకుంటున్నాడు. ఉద్యోగాలకి దరఖాస్తులు పెట్టడం. తిరగడం, ప్రాధేయపడడం, అతగాడు యెంత మాత్రం సహించలేకపోయాడు. కాంగ్రెసు అంటే అభిమానం. సాధ్యమైనంత వరకు స్వదేశీ వస్తువులే కొంటూవుంటాడు.

కామేశ్వరరావు రసపిపాసికావడంచేత కళాహృదయానికి సంపూర్ణంగా వ్యతిరేకమైనటువంటి "సేవ" అనే పదార్థము అతనికి యెల్లా ఆవేశం కలగజేస్తుంది? అతని మనఃపథాలల్లో డ్రాయరుబల్ల, ప్రక్కన కాగితాలపెట్టి, బీరువా, కాగితాల కట్ట దొంతరలు ఇవి చిత్రలేఖనానికీ, శిల్పానికీ వ్యతిరేకమైన అడ్డుగీతలని అనుకుంటాడు.

"ఆకాగితాలు యెందుకు పంపించవు? ఈ విషయంమీద నోటు పంపించవేమీ?" అనే మాటలు గాంధర్వ మహాకళకు అపశ్రుతులని తలుస్తాడు.

పైవారికి కిందవారికి పంపించే విజ్ఞాపనలు, తాఖీదులు కవిత్వం అవుతాయా అని పృచ్ఛచేసుకుంటాడు.

ఏలాగున అతడు ఉద్యోగాలకి ప్రయత్నించగలడు?

కామేశ్వరరావుకు సంగీతమంటే పరమ ప్రాణం. కవిత్వమంటే చెవికోసుకుంటాడు. చిత్రలేఖనం, శిల్పం చూసి మురిసిపోతాడు. కళారసజ్ఞుడు. కాని ఒక్క కళలోనూ ప్రవేశంలేదు. గొంతుక కొంచెం బాగుంటుంది. అంచేత దేవులపల్లివారి దేవాలయం దగ్గరికి, నండూరివారి నాయుడు గ్రామానికీ, చింతావారి పుణ్యక్షేత్రానికి, కవి కొండలవారి వికసితోత్పల దగ్గరికీ, విశ్వనాథవారి కిన్నెర వాగులకీ, ముద్దుకృష్ణుని మురళీజ్వాలల దగ్గిరికీ, తీర్థయాత్రలుచేస్తూ, వరుసలు నేర్చుకుంటూ వస్తూవుంటాడు. గ్రామఫోను పాటలు చాలా బాగా వచ్చును. స్థానంవారి స్థాయిమార్పు విలాసాలకు మురిసిపోతాడు. అద్దంకివారి ముద్దు గొంతుక, కపిలవాయివారి గంగాప్రవాహం, జొన్నవిత్తులవారి కిన్నెర కంఠం, సి.యస్.ఆర్. చిన్నారి పొన్నారి పాటలు, తుంగలవారి గమక భంగిమాలు బాలగంధర్వుని పరమ గాంధర్వం, నారాయణరావు వ్యాస జీవగీతాలు, పెండార్కర్ వుద్దండ సంగీతం మురిసిపోయి, సొక్కి, కన్నులరమూతలేసి ఆనందంలో వూగిపొయ్యేవాడు.

కాని సంప్రదాయ సిద్ధమైన త్యాగరాయాదుల పాటలు, రాగాలాపనలు, రాగమాలాప్రవాహాలు అంటే అతనికి తలనొప్పి.

ఆనాడు రాత్రి తోలు బొమ్మలాటలో సమ్మోహనాస్త్రతుల్యమై ఆ బాలికా కంఠం విన్నప్పుడే నెమ్మదిగా ఇంటికిపోయి అయిదు రూపాయల నోటు పట్టుకొచ్చి తోలుబొమ్మల పందిరి వెనక్కివెళ్ళి వీరయ్యని ఈవలికి పిలిచి "నీ మనవరాలి గొంతుక్కి ఇదిగో రా బహుమానం" అని ఇచ్చాడు. ఆ తక్షణము వీరయ్య కథ ఆపుచేసి తెరమీద బొమ్మనెక్కించి "మరీ మరీ కామేశ్వరరావుగారూ" అని పొగిడాడు. గొప్ప ప్రభువులకు చూపించే మంచిబొమ్మలు తెరమీద కెక్కించాడు.

ఆనాటినుంచీ కామేశ్వరరావుకు మీనాక్షి కంఠము సర్వకాలము ప్రతి ధ్వనిస్తూనే వున్నది.

ఆ బాలిక కొంచెము ఛామనఛాయ. నవయౌవనము పరిమళిస్తూ వున్న పొంకాల రేఖలు సుడులుతిరిగి కరిగిపోతూవున్న విగ్రహము. మోముకోల. వెడల్పు కొంచెము తక్కువైన పొడుగుపాటి కన్నులు. చివర కొంచెము వట్రువ తిరిగిన ముక్కు. మావిచివుళ్ళ పెదవులు. అవశ్రుతిలేని సౌందర్యఖని. ఆ బాల మోము కళాకోవిదత్వము స్పష్టీకరిస్తూవున్నది.

ఇదివరకు యేనాడున్నూ కామేశ్వరరావు ప్రణయావేశుడు కాలేదు. పవిత్రమైన తెలగవారి కులంలో పుట్టిన తనకు, ఈ నీచంగా సంచరించే బొమ్మలాటవాళ్ళ కన్నెపై ఈ రోజున ఈ ప్రణయ ప్రాదుర్భావము యేమిఁటి? చదువుకుంటూ వున్నాడనిన్నీ, ఇంత అన్నవస్త్రాలకి ఇబ్బంది లేకుండావుండే సంప్రదాయ కుటుంబంలోని పిల్లవాడనిన్నీ ఆలోచించి, యెక్కువ కట్నంతో, తమ బాలికల నిస్తామని అనేక పెద్దకుటుంబాల నాయుళ్ళూ, కాపులు వస్తూవున్నారు. చక్కని, తెలివైన, చదువుకున్న బాలికను చూచి

పెళ్ళిచేసుకుందామని అనుకుంటున్నాడు. అలాంటి తనకు ఈ ప్రేమ యెక్కడనుంచి ప్రత్యక్షమయిందో!

ఆ బాలిక ఈ ఊళ్ళోనే సంగీతము నేర్చుకుంటున్నది. అతని హృదయం రాగాలు పాడింది. తాను కూడా సంగీతము నేర్చుకోవాలని చిరకాలంనుంచి ఉన్నదిగా!

మర్నాడు సీతారామయ్యగారిని కలుసుకున్నాడు.

"ఏమండీ, గురువుగారూ, నమస్కారం."

"దీర్ఘాయుష్యమస్తు, వివాహసిద్ధిరస్తు. యేమండీ, కామేశ్వరరావు గారూ, రెండు నెలల్నుంచి నా ఫిడేలు వినడానికి రావడంలేదే?"

"ఇదివరకు మీతో అంటూ వచ్చానుగాని నా యమ్.ఏ. చదువుకి సంగీతానికి పడదని తమ శిష్యుణ్ణి కాలేదు. నాకు సంగీతం నేర్పడం మీరు మొదలెట్టాలని నా మనవి."

"నాకు ప్రస్తుతం అయిదు పెద్ద పాఠాలున్నాయండీ, పొద్దున్న, రాత్రి ఇంటి దగ్గర కుఱ్ఱాళ్ళకి చెప్పాలి. తక్కిన కాలంలో ఈ అయిదు పాఠాలు సరిపోతాయి. బాబూ, నన్ను క్షమించాలి."

"యెల్లాగో తీరిక వేసుకుని మీ యింటి దగ్గరే నాకు ఆరో పాఠంగా నేర్పాలి. మీరే రెండు మూడుసార్లు నా గొంతుక మంచిది సంగీతం నేర్చుకోమన్నారు."

"మీబోటివాళ్ళు మా ఇంటికి రావడమే!"

"నన్ను సంగీతం నేర్చుకోవద్దంటారా?"

"అయ్యయ్యో! యెంత మాటంటారూ! మీ బోటి ఉత్తములకు సంగీతం నేర్పకపోతే నా విద్యెందుకండీ!"

"ఇన్నాళ్ళూ ఈ చదువులతో కాలం వృథాపుచ్చాను. ఈనాటికి నా సంకల్పం కలిగింది. సంగీతం విని ఆనందించేందుకైనా నేర్చుకోవాలని ఉంది."

"మీరు మా ఇంటికి రావడం నా మనస్సు ఒప్పదండీ."

"అయితే, తమరు మా యింటికి తమ ఇష్టము వచ్చినప్పుడు దయచేయొచ్చునే."

"అయిదు పాఠాలు రోజంతా తీసుకుంటున్నాయి."

సీతారామయ్యగారు చిరునవ్వు నవ్వుకున్నాడు.

"మీ దీక్ష నాకు సంతోషం కలుగజేస్తున్నదండీ."

"నాది ఆరోపాఠం. తమ ఇంటికే వచ్చి నేర్చుకుంటాను. తమ సేవ చెయ్యడానికి నాకీ సావకాశం ఇవ్వండి."

"మీరు ఉద్యోగానికి వెడుతారే?"

"అసలు ఉద్యోగానికే వెళ్ళను. ఒకవేళ వెడితే అంతవరకే చెప్పండి. నా అదృష్టం అంతే అనుకుంటాను. ఇక అభ్యంతరాలు చెప్పకండి. సంగీత హృదయంలోకి నన్ను చొచ్చి పోనివ్వండి. మిమ్మల్ని వదలను, మీ ఇంటికి వచ్చే నేర్చుకుంటాను. మంచి ముహూర్తం చూసి తమరెప్పుడు రమ్మంటే అప్పటినుంచి తమ దగ్గిర శుశ్రూష ప్రారంభిస్తాను" అని కామేశ్వర్రావు చేతులు జోడించినాడు.

"అయ్యయ్యో, అదేమిటీ కామేశ్వరరావుగారూ" అని ఆయన కామేశ్వర్రావు చేతులు పట్టుకున్నాడు.

## 5

**కా**మేశ్వర్రావు పాఠం సాయంత్రం ఏడింటికి మొదలుపెట్టి ఏడున్నరకు పూర్తిజేసేవారు. అతను మహాదీక్షగా నేర్చుకుంటున్నాడు. అంచేతనే అందరికీ గంట చెప్పే పద్ధతి తన దగ్గర అవసరం లేకుండా చేసుకున్నాడు. ఏడున్నర దగ్గర నుంచి రాత్రి ఎనిమిదిన్నరవరకు మీనాక్షికి పాఠం చెప్పేవారు సీతారామయ్యగారు. మీనాక్షి పాఠం అయిన తరువాతనే కామేశ్వర్రావు ఇంటికి వెడుతూ ఉండేవారు. ఇంటి దగ్గర సాధన చేయడంవల్ల కామేశ్వర్రావుకు సంగీతశాస్త్ర సిద్ధాంతాలన్నీ ఇట్టే కరతలామలకమైపోయాయి. జంటలు, గీతాలు, స్వరజితులు, వర్ణాలు ఆరునెలల్లో పూర్తిజేసి కీర్తనలకు వచ్చాడు. మీనాక్షి తన తాతగారు నేర్పినదంతా మర్చిపోయి మళ్ళీ నేర్చుకోవలసి వచ్చింది. అద్భుతమైన గొంతుక కాబట్టి మూడు నెలల్లో రాగాలు, కీర్తనలు కూడా ప్రారంభించింది.

మీనాక్షి వికసిస్తూవున్న పుష్పం. ఆమె ఇంకా అందాలు కోసుకొని దండలు గుచ్చుకుంటోంది. ఆమె హృదయము లేడిపిల్లలాంటిది. చిన్నతనాన్నుంచి ఆమె కంఠంలోని గానాద్భుతం చూచి మురిసిపోయే తాతగారు ఆమెకు చక్కని సంబంధం వెతికి మనమణ్ణి తెచ్చుకొని ఇల్లరికం ఉంచుకోవాలని ఉవ్విళ్ళూరుతో ఉండేవాడు.

మీనాక్షికి కామేశ్వర్రావు ఎందుకంత తనతో చనువు చేసుకొంటున్నాడో అనే ఆలోచనైనా కలుగలేదు. కామేశ్వర్రావును చూస్తే ఆమెకు చాలా సంతోషంగా ఉండేది. ఎప్పుడూ అతనితో ప్రాణమిచ్చి మాట్లాడేది. జట్టుతోపాటు ఆమె యెన్ని ఊర్లు తిరిగినా ప్రపంచ జ్ఞానములోని ఓనమాలన్నా ఎరగదు. అంచేత కామేశ్వర్రావు రైళ్ళను గురించి, విమానాలను గురించి, సినీమాలను గురించి, విద్యుచ్ఛక్తి దీపాలను గురించి, దేశాలు, దేశాలలోని ప్రజలు, పంటలు, నగలు, దుస్తులు మొదలైన వాటిని గురించి నోరూరేట్లు చెబుతూ ఉంటే విస్తుపోయి వింటూ ఉండేది.

మీనాక్షి సీతారామయ్యగారింట్లోనే భోజనం చేసేది. ఆయన తనకోసం అని ఇచ్చిన వీధిగదిలో సామాను పెట్టుకుని అక్కడనే పడుకునేది. కామేశ్వర్రావు స్నేహముచేత శుభ్రత, శుచి, రసజ్ఞత వీటిని గురించి మీనాక్షి బాగా నేర్చుకొన్నది. ఎరకలవాళ్ళ పందులు దొడ్డిలావుండే మీనాక్షి గది నెమ్మది నెమ్మదిగా మార్పు చెంది ఆరు నెలలలో కళాప్రదర్శనపు మందిరములా తయారైనది. మోడరన్ రివ్యూ, భారతి, గృహలక్ష్మి మొదలైన పత్రికల్లోంచి కామేశ్వర్రావు సంగ్రహించిన బొమ్మలు అద్దాలు కట్టించి గోడలమీద వేలాడ గట్టుకుంది. రెండు మూడు జపాన్ వెదురు అల్లిక తెరలు కూడా గోడలకు తగిలించింది.

ఇంతలో సీతారామయ్యగారి పెద్దకూతురు పుట్టింటికి పండక్కని చక్కా వచ్చింది. ఆ అమ్మాయి అత్తవారు కాకినాడ. అత్తవారు మంచి నాగరికతగల కుటుంబ మగుటచేత ఆమె అతి నవీన నాగరికతా సంప్రదాయంలో ప్రథమ తరగతిలో ప్రథమముగా వుంటూన్న

వాళ్ళలో ఒక్కత్తె. మన దేశంలో భర్తకి ఎట్లా యిష్టం అయితే అలాగ మారిపోతారుగా ఆడవాళ్ళు. ఆవిడకు సీతారామయ్యగారు పెట్టిన పేరు వియ్యమ్మ. నేడు విజయానందని.

గోదావరి వరదలా ఇంట్లోకి చక్కా వచ్చింది.

"అమ్మా, వీధిగదిలో నుంచున్న అమ్మాయి ఎవరే?"

"నాన్నగారి దగ్గిర సంగీతం నేర్చుకుంటూ వున్న ఒక బొమ్మలాళ్ళమ్మాయి.

"బొమ్మలా ళ్లేమిటేవు?"

"తోలుబొమ్మలాళ్లీ."

"తోలుబొమ్మలాళ్ళకి సంగీతం యేమిటి?"

"ఆ అమ్మాయి కంఠం కిన్నరీ కంఠం. అంత అందమైన కంఠం నేనెక్కడా వినలేదు సుమా! సంగీతంలో కూడా మీకు తగ్గ తెలివితేటలున్నాయి. ముచ్చటపడి నీకు యెంత బాగా సంగీతం నేర్పారో అంత యిదిగాను మీ నాన్నగారు యీ అమ్మాయికి నేర్పుతున్నారు. మా మంచిపిల్ల. నేనంటే ప్రాణం. కూతుళ్ళిద్దరు కాపరాల కెళ్ళినందున నాకు మూడవ కూతురైంది."

ఆ రోజునుంచే విజయకి మీనాక్షికి కృష్ణా, తుంగభద్రా సంగమమైనది. విజయానందని పుట్టింట రెండు నెలలు వుంది. ఆ రెండునెలలో వేణీభరంకూర్చే పద్ధతుల్లో, సొగసైన వస్త్రాలు యెన్నుకొనే విధాలల్లో, నగలు అలంకరించుకొనే రీతుల్లో, పువ్వులు ముడుచుకునే మోస్తరుల్లో, మొహానికి "మంచులు", వెన్నలు, పవుడర్లు, పెదవులకు, బుగ్గలకు రంగులు సొగసు చేసుకొనే సూత్రాల్లో, టాల్కం పొడులు దేహానికి అద్దుకునే అందాలలో, యూడీకొలోను, లవండరు మొదలైన పరిమళ జలాలు బట్టలపై జల్లుకొనే చందాలలో విజయ మీనాక్షికి గురూపదేశము చేసినది.

విజయ సంగీతంలో సరస్వతి. గొంతుక అంత అందముగా వుండకపోయినా ఉత్కృష్టమైన సూక్ష్మాతిసూక్ష్మమైన శ్రుతి, స్వర, లయజ్ఞాన ముండుటచేత వినేవారి హృదయాలలో అమృత బిందువులు కురిసేటట్లు పాడగలదు. ఆమె వున్న రెండు నెలలలోను మీనాక్షి పదియేళ్ళ విద్య నేర్చుకొన్నది.

ఆ రెండు నెలలు కామేశ్వరరావు మీనాక్షితో తానొక్కడే యెక్కువ చనువుగా ఉండేందుకు వీల్లేకపోయింది. కామేశ్వరర్రావు సంగీతం నేర్చుకోవడం విజయకు ఆశ్చర్యమే వేసింది. విజయ మీనాక్షిని వెనుక వేసుకొని చిత్రలేఖనాన్ని గురించి, హిందూదేశములో వుండే అద్భుత శిల్ప విన్యాస దేవాలయ నిర్మాణాది విచిత్రాలని గురించి కనుక్కుంటూ వుండేది. ఎంత అతి నవీన పద్ధతిని వేషంవేసుకున్నా విజయ అంటే కామేశ్వర్రావుకు యెక్కువ గౌరవము, భయమున్ను, వంచినతల యెత్తకుండానే మాట్లాడేవాడు. కన్నింగ్‌హామ్ ప్రభ్వి అజంతా బొమ్మల పుస్తకం, ఫెర్గుసన్‌గారి భారతీయ శిల్పగ్రంథాలు మొదలైనవి తెప్పించి, కామేశ్వర్రావు వాళ్ళిద్దరకూ చూపించేవాడు. ఇంతలో విజయ అత్తవారింటికి వెళ్ళిపోయింది. అమ్మయ్యా అని కామేశ్వర్రావు నిట్టూర్పు విడిచాడు.

## 6

**మీ**నాక్షి రెండేళ్ళు గురుకులవాసము చేసింది. వచ్చిన చదువు చాలునని యింతలో ఆమె తాత వీరయ్య గరుత్మంతుడులా వచ్చి మనుమరాల్ని తీసుకు చక్కాబోయాడు. ఆ బాలిక సీతారామయ్యగారికడ సెలవు పుచ్చుకొని ఆయన పాదాలకు, ఆయన భార్య పాదాలకు నమస్కారంచేసి తల్లిదండ్రులను వదలి వెళ్ళే బిడ్డలా వెక్కి వెక్కి యేడ్చింది.

ఆ దంపతులు ఇరువురికీన్నీ కళ్ళు చెమర్చినవి. వీరయ్య మనుమరాలి చేత తాంబూలములో పదికాసులుపెట్టి ఇప్పించబోగా సీతారామయ్యగారు కోపగించుకొని వీరయ్యను తలవాచేటట్లు చీవాట్లుపెట్టినారు. "ఆమె నా కూతురు. అల్లాంటి అమ్మాయికి చదువు చెప్పడం నా అదృష్టం" అన్నారు. భార్యచేత మీనాక్షికి పసుపు, కుంకుమ, చీర, రవికలగుడ్డ యిప్పించారు.

కామేశ్వర్రావు హృదయం దడదడమని కొట్టుకొంటోంది. కుంగిపోతూ నిలబడినాడు. మీనాక్షికోసం తెప్పించిన తొంబది రూపాయల తంబూరాను ఆమెకిస్తూ "మీనాక్షి! ఇక నన్ను మరచిపో!" అన్నాడు.

మీనాక్షి వెక్కి వెక్కి ఏడ్చింది. కామేశ్వర్రావును వదిలిపెట్టి వెళ్ళుట ఆమెకు అంతరాంతరాలల్లో మరీ కష్టమైతోచింది.

## 7

**అ**ప్పుడు జట్టంతా బెజవాడలో ఉంది. వీరయ్య, విరలుడు, చిన్న వీరయ్య మీనాక్షిని ఆనమాలు కట్టలేకపోయారు. ఆ బాలిక పెంటకుప్పలో నుంచి బయలుదేరిన చేమంతి చెట్టులా ఉన్నది.

మీనాక్షి తనవాళ్ళను యెగాదిగా చూచుకొన్నది. వంద సంవత్సరాల క్రితం ఉతికిన బట్టలు కట్టుకుంటూ, వారానికి ఓమాటైనా స్నానం చేయకుండా తిరుగుతూ, నానావిధ నీచపదార్థాలు తింటూ, ఊరుబైట వేసుకున్న గూడు గుడిశల్లో, సామాను మోసుకొనేందుకు ఉపమోగించే గాడిదలతోటి, కాపలా కాసుకొనేందుకు ఉపయోగించే పులుల్లాంటి కుక్కలతోటి సావాసంచేస్తూ, నూని రాసుకుని దువ్వుకోనందున పేలుపట్టియున్న తలలతో, వెట్టిమొట్టి రాళ్ళపూసల పేర్లనగలు పెట్టుకున్న మెళ్ళతో, వెండిమురుగులు అలంకరించిన చేతులతో, బంగారు గుల్ల దండకడియాలు దాల్చిన బాహులతో, వెండిబిళ్ళల మొలనూళ్ళతో, వెండి వడ్డాణాలతో, పొగాకు, తమలపాకూ గారలు కట్టించిన నోళ్ళతో తన చుట్టూ ఉన్న తన చుట్టాలను చూసేటప్పటికి మీనాక్షి హృదయం క్రుంగిపోయింది. సీతారామయ్యగారి ఇల్లు, ఆ రోజుల తన జీవితము మీనాక్షికి కళ్ళయెదుట అస్తమానమూ ప్రత్యక్షమౌతూనే ఉన్నది.

ఈ రెండేళ్ళూ సీతారామయ్యగారు తండ్రి అయ్యాడు. ఆయన భార్య తల్లి అయింది. ఆయన కుమార్తె అక్క అయినది: కామేశ్వర్రావు ప్రాణ స్నేహితుడైనాడు. కంపులతో, పెంటపోగులతో నిండి వున్న ఆ యేలూరి కాలవగట్టు నరక కూపమై తోచింది.

కామేశ్వర్రావుగారు తనకు పదేపదే చెప్పిన ప్రకృతి విలాసాలేమీ ప్రత్యక్షంకాలేదు సరికదా, ఆకాశాన్ని నక్షత్రాలు గాడిదలద్దెలలా కనపడ్డా యా బాలకు. బెజవాడచుట్టూ ఉన్న కొండలు పాడైపోయిన పూరిగుడిసెల్లా ఉన్నాయి.

ఎందుకు తన కీ సంగీతం నేర్పించారు? బాగా బతకడం యొక్క అందం ఎందుకు తనకు నేర్పుట? అడవికళ్లకు శిల్ప సౌందర్యం యిచ్చింది మళ్ళీ ముళ్ళడొంకల్లో పడవేయడానికా? ఆమెకు జలజల కన్నీళ్ళు ప్రవాహాలు కట్టినవి. తండ్రీ, తాత, తల్లీ వాళ్ళు యమకింకరుల్లా కనపడ్డారు. కామేశ్వరరావుగారి పాదాలు కొలుస్తూ, దాసీలా ఇంత సేవ చేస్తూంటే బాగుండునే! గురువుగారికి, గురువుగారి భార్యకు, వాళ్ళింట్లో పనిచేసే మనిషిలా తాను చాకిరీ చేస్తూ ఉండిపోతే బాగుండునే! గురువుగారూ, కామేశ్వర్రావుగారూ ఎందుకు తనను తాతగారు తీసుకొస్తూంటే ఊరుకొన్నారో! కామేశ్వర్రావు నాయుడుగారు తియ్యటికబుర్లు చెపుతూంటే తాను నిజమనుకొంది. మలాంలేసి జీనుచేసి, మంచిదుస్తులు వేసినా గాడిద గుఱ్ఱం ఎలా అవుతుందని వాళ్ళిద్దరూ తనని వదిలేసి ఉంటారు. కులదైవము రాములవారు అసలున్నాడా?

ఆ రాత్రల్లా నిద్రపోకుండా ఏడుస్తూనే ఉన్నది మీనాక్షి.

వీరయ్య తన మనవరాలు మళ్ళీ తిరిగి తన జట్టులోనికి వచ్చినదనిన్నీ, పేరుపొందిన సంగీత పాటకుడగు సీతారామయ్యగారి దగ్గిర సంగీత విద్య నేర్చుకొని గొప్పపాటకురాలైనదనిన్నీ బెజవాడ నగరాల పేటలో చాటింపించాడు. ఆ రాత్రి అక్కెళ్ళవారి సత్రం దగ్గిర తోలుబొమ్మలు చూడటానికి వచ్చిన జనం బెజవాడ పుష్కరానికన్నా రారు. ఉత్తర గోగ్రహణం కథ ప్రారంభించారు. మీనాక్షిది సైరంధ్రిపాత్ర. బొమ్మలాట పాకలో ఒకమూల నలిగిపోయిన పువ్వులదండలా, చంద్రుడు లేకుండా కారుమబ్బులుపట్టి, తుంపర్లుపడుతూన్న రాత్రిలా కూచుని ఉంది. వీరయ్య, విఘ్నేశ్వర, సరస్వతీ ప్రార్థన లవగానే "ఆలాగున ధర్మరాజులవారున్నూ, భీమసేనుల వారున్నూ, అర్జున మహారాజున్నూ, నకుల సహదేవులైన కవలలున్నూ, ద్రౌపదీదేవి మహారాణియూ, ధౌమ్యులవారితో కూడానున్నూ" అని అన్నాడు.

"ఆహా!"

"పన్నిండేళ్ళున్నూ, అటవీ, అరణ్యం, విపినం, గహనం, కాననం, వనం, ఇత్య మరః, అయినటువంటి అరణ్యంలో వాసం చేసినవారు అవుకుంటూ-

"ఆహా! ఇక ఏలాగయ్యా! సంవత్సరో, వత్సరో, అబ్దో, హాయనో, శరత్సమాః, ఇత్యమరః, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేయవలసుంటుంది అని ఆలోచించుకుంటూ-"

"ఆహా!"

ఈ రకంగా కథ సాగించారు. ఇంతలో ద్రౌపది పాట పాడవలసిన సమయం వచ్చింది. జట్టు అందరూ మీనాక్షివైపు చూశారు. ఆ బాలిక మోకాళ్ళు ముదుచుకొని, కూర్చొని మోము మోకాళ్ళలో ఉంచుకొని, చేతులు మోకాళ్ళకు చుట్టుకొని, కళ్ళలోంచి, అశ్రుబిందువులు రాలుస్తూ ఈ లోకంలో లేదు. తల్లి వెళ్ళి "మీనీ, మీనీ పాట పాడ్డానికి

రావే, నీ దుంపతెగ. మొద్దులా కూర్చున్నావేమే? లే, వచ్చి పాట పాడు" అని కేకలు వేసింది. చిచ్చరపిడుగులా లేచింది మీనాక్షి.

"నేను పాడదలచుకోలేదు. మీ సరుకులు మోసే గాడిదలులా మీరు కూడా గాడిదలు. తోలుబొమ్మలాటా? ఇది దెయ్యాలాటా?" అని కాళ్ళు గబగబ భూమికేసి తన్నింది. తల్లి బ్రతిమలాడ్డం, తండ్రి కేకలు వేయడం, అంతా తాతగారు చూస్తున్నాడు. అందాకా ద్రౌపది భాగం చిన్న వీరయ్యకు క్రొత్తగా వచ్చిన భార్య చదువుతూ వున్నది. వీరయ్యకు కోపము వచ్చింది. ప్రళయకాల రుద్రమూర్తిలా అయిపోయాడు. రెక్కలుపట్టి నుంచోపెట్టాడు. "నీకు సంగీతం చెప్పించినందుకా ఇంత పొగరుమోతుతనం? ఇంతట్లోకే మహారాణివైనావనా నీ ఉద్దేశం. ఛండాలపు రండా లే, వచ్చి పాడు. చావగొట్టేస్తాను" అని ఉరిమాడు.

తాతగారి కోపం చూసి దడదడలాడుతూ, భయంతో తెరవద్దకువచ్చి మద్దెలకు నమస్కరించి పాట యెత్తింది. శ్రుతి కలవదు. వెనకటి వరసరాదు. గొంతుక స్థాయికి పెరగదు. అందరూ అందిచ్చినారు. నాలుగు గొంతుకలు కలిసినవి. కాని మీనాక్షీ గొంతుక అందుకోదే! పదిహేను నిమిషాలు తంటాలు పడ్డారు. మీనాక్షి గొంతుక అపశ్రుతి తప్పుకోదు, సామ్యం యేర్పడదు. తెర అవతల ప్రజల్లో గడబిడలు బయల్దేరాయి. "మీనాక్షిని పాడమనండీ, మీనాక్షిని పాడమనండీ" అని కేకలు. మీనాక్షి పాడలేదు. అందరికీ వెఱ్ఱెత్తిపోయింది. వీరయ్య అన్యాయం చేశాడు అంటూ ఉప్పెన కెరటం విరుచుకుపడ్డట్టు జనం అంతా పందిరిమీదకు విరుచుకు పడడం మొదలెట్టారు. వీరయ్య గజగజలాడిపోయినాడు. మీనాక్షి నిద్రలేచి వచ్చినట్లు లేచి వెనకటి గొంతుక తెచ్చుకొని వెనకటిలా పాడదామని యెంతైనా ప్రయత్నం చేసింది. కాని లాభం లేకపోయింది. ఆమెకు ఏడుపు వచ్చింది. వెక్కి వెక్కి యేడ్చింది.

జనం వచ్చి తెరమీదపడి తెర పీకేశారు. విఠలుడు ఈ గడబిడంతా చూసి ఆడవాళ్ళని చేతికి దొరికినన్ని బొమ్మలు పట్టుకొని పారిపొమ్మన్నాడు. మిగిలిన బొమ్మలు చిన్న వీరయ్య చేతికిచ్చి పరిగెత్తమన్నాడు. తిత్తీ, మద్దెలా యిచ్చి తండ్రిని పంపివేశాడు. ఇంతలో నగరాలలో వీరయ్య అంటే మంచభిప్రాయం కల్గిన ఒక వస్తాదుల జట్టు లాటీకర్రలతో రంగంలో ప్రవేశించి, దెబ్బలాడి, ప్రజలు పాకకు నిప్పు అంటించకుండా చూశారు. జనం అంతా వెళ్ళిపోయిన తరువాత విఠలుడు తక్కినవన్నీ సర్దుకొని తమ గుడిసెలకాడికి చేరుకున్నాడు.

జట్టును లేవదీసుకొని బందరు పారిపోయాడు వీరయ్య.

## 8

**కా**మేశ్వర్రావుకు మీనాక్షి వెళ్ళినప్పటినుంచీ మతిలేదు. అతని ప్రేమకు మీనాక్షి నిదానమైపోయింది. యౌవనము వచ్చిన యిన్నాళ్ళకు ప్రేమంటే యేమిటో తెలుసుకున్నాడు. మీనాక్షితో రెండేళ్ళు స్నేహంచేసి, మీనాక్షి, తానూ సహాధ్యాయులై, మీనాక్షికి తాను గురువై, మెలిగిన తరువాత తీరా మీనాక్షి వెళ్ళిపోయిన వెనుక తనని మూలమంతా కదిల్చివేసిన ప్రేమతో ఆమెను ప్రేమిస్తున్నానని గ్రహించాడు. ఆమె మాటలు, దివ్యమైన ఆమె

గాంధర్వమూ, విచిత్ర సుందరమైన ఆమె మూర్తి అతని బ్రతుకుచుట్టూ మహా ప్రపంచములైనవి, మీనాక్షి నామము జపమైనది. "దేవీ మీనాక్షి" అని అతని హృదయ కుహరాలలో పల్లవి సర్వకాలమూ నిసదిస్తూనే వున్నది.

భీమవరంలో ఒక్క నిముషం వుండలేకపోయినాడు, రెక్కలు కట్టుకొని బెజవాడ వచ్చిపడ్డాడు. అక్కడ వాకబు చేసి బందరు వెళ్ళారని తెలుసుకొని సాయంత్రానికి బందరు చేరుకున్నాడు, వీరయ్య జట్టు వాళ్ళు ఇనుకుదుర్లో తమ పూరిగుడిసెలు వేసుకొన్నారు. కామేశ్వర్రావు తిరిగి తిరిగి అక్కడకు చేరుకున్నాడు. తన ఆత్మలో, ఆత్మయగు మీనాక్షి ఆ పూరిగుడిశెల్లో వుందనే భావం అతన్ని దహించివేసింది. ఇది వరదాకా తోలుబొమ్మలవాళ్ళు అల్లాంటి పూరిగుడెశెల్లో వుండడం అతనికేమీ ఆశ్చర్యం కలుగజేయలేదు. అక్కడికి వెళ్ళి "వీరయ్యా" అని కేకవేసినాడు. వీరయ్య యివతలికి వచ్చి కామేశ్వర్రావుగారిని చూచి "బాబూ! ఇల్లాగ వచ్చారేమిటి?" అని ప్రశ్నించాడు. కామేశ్వరరావు ప్రక్కనేవున్న కాలవకు కట్టిన తూము అరుగుమీద కూర్చుని వీరయ్యని ప్రక్కనే కూర్చోమన్నాడు.

వీరయ్య కామేశ్వర్రావుతో "బాబూ, నా నోటిదగ్గిర కూడు క్రిందికి బోర్లాపడింది సామీ" అని బెజవాడలో జరిగినదంతా వెళ్ళబోసుకున్నాడు. "సీతారామయ్యబాబుగారు మా పిల్లను పాడుచేశారు సామీ! పాట పాడలేదు, గొంతు యెత్తలేదు. ఆటకెందుకూ పనికిరాకుండా పోయింది" అతడు నదుటి మీద కొట్టుకున్నాడు.

కామేశ్వర్రావు అంతా నిమిషంలో గ్రహించాడు. అతనికి ఒక చక్కని ఆలోచన మృదువుగా తట్టింది. లేచి నుంచొని వీరయ్య భుజంమీద చేయివేసి "వీరయ్యా, నువ్వేమి కంగారుపడకు. గురువుగారు చేసిన దెప్పుడూ తప్పుకాదు. అందులో మా గురువుగారు పరమ పవిత్రుడు. నువ్వు ఒక వారం రోజులు ఆటాగీటా తలపెట్టకు. ఓపికపట్టి మాత్రం యెదురుచూస్తూవుండు" అని చెప్పి, ఆ చీకట్లలో మాయమైపోయినాడు. వీరయ్యకు ఆశ్చర్యం వేసింది. కామేశ్వర్రావుగారు యేమిచేస్తారా అని అనుకుంటూ తన గుడిసె ప్రక్క ఆరుబయట వేసిన నులక మంచంమీద నిద్రపోతూవున్న మనుమరాలిని చూసి "తల్లీ! నీకు మీనాక్షిదేవి పేరుపెట్టుకున్నాను, ఏంచేస్తావో?" అని తలపోసుకున్నాడు.

## 9

**బం**దరులో వుండే ఉద్యోగస్థులకు, వర్తకులకు, భాగ్యవంతులకు ఒక రోజున ఆహ్వానపు పత్రికలున్న కవర్లు వచ్చాయి.

**గొప్ప సంగీతపు ప్రదర్శన**
**శ్రీమతి మీనాక్షిబాయిది**

ఆర్యా!

అభినవ మీరా యనదగిన ఈ బాలిక కంఠము మాధుర్యాతి మాధుర్యము. పాండిత్యము పండితులచేతనూ మెప్పుపొందదగినది. కాన తాము విచ్చేసి ఈ బాలికా గాన పవిత్రతలో దివ్యులుకండని మా ప్రార్థన.

మచిలీపట్టణము, కామేశ్వర్రావు. ఎం.ఏ.,

16-04-1924, సీతారామయ్య.

గాత్రము ..... మీనాక్షిబాయి.

ఫిడేలు ..... సీతారామయ్య

మృదంగము ..... మణిఅయ్యరు.

రేపు 17-4-24 తారీఖున - హాలులో 5 గంటల నుండి 8 గంటలవరకు -

కామేశ్వర్రావు పెద్దలందరకూ 3 రూపాయలు టికెట్లు పంపినాడు. బందరుపురముననున్న సంగీత పండితు లందరికడకూ కామేశ్వర్రావు స్వయముగా వెళ్ళి వారి నాహ్వానించి, వారికి గౌరవపు టిక్కెట్లిచ్చినాడు.

ఊరంతా పేపర్లు పంచిపెట్టబడినవి. 17వ తారీఖున 500 రూపాయల టిక్కెట్లమ్మబడినవి. హాలు కిటకిట లాడుతూ వున్నది. మణి అయ్యరూ, సీతారామయ్యగారూ పక్క వాద్యాలు వాయించే ఈ ప్రతిభాశాలిని ఎవరయ్యా, అనుకుంటూనే వచ్చారు జనమంతా. సరీగా అయిదు అయ్యేటప్పటికి సీతారామయ్యగారు, మణిఅయ్యరుగారు, మీనాక్షిబాయీ వచ్చి కూర్చున్నారు. సభను చూసి మీనాక్షి గజగజలాడిపోయింది. అందాలు సుళ్ళుచుడుతూ ఉమాదేవిలా వచ్చిన ఆ బాలికాదేవిని చూసి, "యీమె పాట యీమె అందానికి తగిందేనా," అని అనుకున్నారు. సభాప్రారంభములో మీనాక్షి కొంత జంకింది. ఆనందరసవాహినియగు సీతారామయ్యగారి ఫిడేలు, లయామృతవర్షిణియగు మణిఅయ్యరుగారి మృదంగం దివ్యంగా వినబడుతూ వున్నవి. గాని, మీనాక్షి గొంతుక ఎవ్వరికీ వినబడలేదు. సీతారామయ్యగారు, కళ్ళుమూసుకుని "పాడమ్మా" అని రహస్యంగా చెప్పారు.

మీనాక్షి కళ్ళుమూసుకుని గురువుగారిని తలుచుకొని సమస్తమూ మరచిపోయి, ఉత్కృష్టగానంతో అద్వైత రూపిణి అయింది. ఆమె కంఠము సంపూర్ణముగా వికసించిన మాలతి తీగలా ఆ సభ అంతా అల్లుకుపోయింది. ప్రేక్షకులు అట్టి గొంతుక ఇదివరకు యెన్నడూ వినలేదు. అట్టి సంగీతము ఎప్పుడూ వినలేదు. సభ పూర్తి అయ్యేటప్పటికి సభికులందరూ తన్మయులై ఉన్నారు.

పట్టణములోని పెద్దలూ, సంగీతవిద్వాంసులూ మీనాక్షిని పొగుడుతూ ఉపన్యాసాలు ఇచ్చారు. జగద్విఖ్యాతులగు మణిఅయ్యరుగారినీ, సీతారామయ్యగారినీ గురించి చెప్పనక్కరలేదన్నారు. ఇంకో సభ ఆ పట్టణంలో చేయాలనికూడా కోరారు. ఆ వెనుక రెండురోజులైన తరువాత సభలో 12 బంగారు పతకాలూ, 100 రూపాయల వెండిగిన్నే మీనాక్షికి బహుమతులిచ్చారు.

ఇదంతా చూసి వీరయ్య ఆశ్చర్యపూరితుడైపోయాడు. అలాంటి సభలూ చూడలేదు, అలాంటి పాటా వినలేదు. నీ మనవరాలు సంపాదించినదని 500 రూపాయలు తీసుకువచ్చి వీరయ్య ఒళ్ళో పోశాడు కామేశ్వర్రావు. ఆరు నెలలు ఆటలాడినా వీరయ్య 200లైనా కళ్ళచూసేవాడుకాడు. కామేశ్వర్రావు వచ్చిన డబ్బు మొత్తం తొమ్మిదివందల యేభై అనిన్నీ, మణిఅయ్యరుగారికి రానూపోనూ ఖర్చులక్రింద, బహుమతిక్రింద, ఇచ్చింది 300 అనిన్నీ, పేపర్లు అచ్చువేయించటం, ఊరంతా పంచిపెట్టించడం వాట్లకీ అయిన ఖర్చు నూరు రూపాయలు అనిన్నీ, 50 రూపాయలు హాలు అద్దె అనిన్నీ లెక్క చెప్పాడు.

కామేశ్వరరావు పూరిగుడిశెలలో ఉండకూదని, ఛండాలపు నీచ పదార్థాలు తినకూడదనిన్నీ వీరయ్యతో హోరాహోరిని దెబ్బలాడి, ఆ గుడిశెలు, గాడిదలు, వాళ్ళబట్టలు అన్నీ, ఇతర బీదవాళ్ళకు దానాలిప్పించాడు. వీళ్ళందరినీ తీసుకొచ్చి సత్రములో పెట్టాడు. శుభ్రమైన వస్త్రాలు కట్టబెట్టించాడు. మీనాక్షి హృదయం సంతోషంతో సంగీతాలు పాడుకొనేటట్లు వీరయ్య జట్టు వాళ్ళందరికి నాగరికతా దీక్ష నిచ్చాడు.

మీనాక్షి సంగీత సభలు నెల్లూరు, గుంటూరు, బెజవాడ, ఏలూరు, రాజమండ్రి మొదలైన పెద్దపురాలలో పెట్టించి, విశాఖపట్టణంలో సభ జరుగుతుందని ప్రకటించాడు. సీతారామయ్యగారినీ, అళహసింగరి శిష్యుడైన ఒక తెలుగు మార్ధంగికుణ్నీ తీసుకొని, కామేశ్వరరావు ఈ సభలు చేయించాడు. భారతీయసంగీత మహాకాశంలో ఒక ఉత్కృష్ట నక్షత్రం బయల్దేరిందనీ, మీరాబాయి మళ్ళీ అవతారం దాల్చిందనిన్నీ పత్రికలన్నీ ప్రశంసించాయి. మీనాక్షికి మెడల్సూ, హారాలూ, వెండి వస్తువులూ మొదలైన బహుమానాలు వానలాగు కురిశాయి.

## 10

**మీ**నాక్షికి కామేశ్వరరావంటే వెఱ్ఱి స్నేహభావం మొదటినుంచీ ఉంది. కాని స్త్రీపురుష సంబంధమగు ప్రేమభావాలన్నీ ఆమెకు కల్గలేదు. స్త్రీపురుషులకుండే ప్రణయభావంగాని, మోహభావంగాని ఈలా వుంటుందని ఆమెకు తెలవదు! ఆమె చూపించే హావభావవిలాసాలు ఆమె హృదయంలో తాండవము చూస్తూవున్న, శైశవ, బాల్యదశలకు సంబంధించినవే. రూపంలో మూర్తీభవిస్తూ ఉన్నప్పటికీ, ఆ బాలికలో స్త్రీత్వము ఇంకా మనఃపథాలలో అవిర్భవించనన్నాలేదు. కామేశ్వరరావు వచ్చి చేసిన ఈ అద్భుతమంతా చూసి, మీనాక్షి విస్తుపోయి వెర్రి ఆనందంలో మునిగిపోయింది. కామేశ్వరరావును కౌగలించుకొన్నది. "నాయుడుగారూ, మీరు గొప్ప మాంత్రికులా ఏమిటి" అన్నది. అతనికి అన్ని చాకిరీలూ చేసేది. తలదువ్వేది, నీళ్ళుపోసుకునేటప్పుడు సబ్బుపెట్టి ఒళ్ళురుద్దేది. తమలపాకులకు సున్నం రాసి యిచ్చేది.

భార్యచేసే చాకిరీలాంటి యీ పరిచర్యచూసి కామేశ్వరరావు ఈ బొమ్మలరాణి తన్ను సంపూర్ణముగా ప్రేమిస్తున్నదని భావించుకొన్నాడు. ఆమె తనను ముట్టుకొన్నప్పుడల్లా అతనివళ్ళు ఝల్లుమనేది. ఆమె తన దగ్గిరగా వచ్చినప్పుడల్లా ఒడిలోకి తీసుకొనేవాడు. ఒకనాడు తన ధృడబాహువుల్లో ఆ బాలికను అదిమిపట్టి, నవనవలాడు ఆమె నునివెచ్చని దేహాన్ని తన దేహానికి హత్తుకుని, బుగ్గలపై, కంఠంపై, కన్నులపై, తలపై ముద్దులవర్షం కురిపించి ఆమె పెదవులను చుంబించనారంభించాడు. మీనాక్షి హృదయం జల్లుమన్నది. ఒళ్ళు ఉప్పొంగిపోయింది. ఆమెలోని బాలికాత్వము పువ్వురేకులలా రాలిపోయింది. ఆ బాలిక అతని కౌగలింతలోనే జవ్వనియగు స్త్రీ అయినది. కాని కామేశ్వరరావుపై ఇంకనూ ప్రణయభావ మేమాత్రమూ కలుగలేదు. స్త్రీత్వమంకురించిన నునుక్రొత్తలో పైకుబికిన మోహము ఆమెను వివశ నొనరించడంవల్ల ఆమె అతని కౌగిలింతలో హత్తుకుపోయింది.

ఆ తరంగం దాటిపోయింది. మీనాక్షికి మెలకువ వచ్చింది. ఆమె అతని బాహువుల్లోంచి విడిపించుకొని ఆ గదిలోంచి బయటపడి తన గదిలో మంచంమీదపడి దొర్లుతూ యెందుకో తనకే తెలియకుండా వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది. ఆ గంభీర విషాదానికి కన్నీళ్ళన్నా లేవు. ఆమె రావిఆకులా గజగజ వణికిపోయింది.

కామేశ్వర్రావు మీనాక్షి తనను ప్రేమిస్తోందని గాఢనిశ్చయం చేసుకున్నాడు. ఇంక తన కర్తవ్యం ఏమిటి? తనకు వివాహం కాలేదు. మీనాక్షితో వివాహం పనికిరాదా? వివాహం లేకపోతే మీనాక్షితో పులకరించే స్నేహమెట్లా? అలాంటి దివ్యమైత్రి తన అంతరాత్మకు వ్యతిరేకమా? అది తప్పా? స్త్రీ పురుష ప్రణయసంబంధానికి వివాహము ముఖ్యమా? పురోహితులచేతనూ, దొంగ ఆధారాలచేతనూ పుట్టిన ఈ పెళ్ళిళ్లు సత్యబద్ధమైనవా? భగవంతునికి యిష్టమైనవా? లేకపోతే వివాహంలేని ప్రణయం పాపమా యిష్టమైనదనేమాట నిజమా? ఇంతవరకూ తాను ప్రేమ అనేదేమిటో యెరుగడు. ఏదో అలంకరించుకొని, పొంకాలు తిరిగివున్న దేహంతోవున్న యువతులాతని హృదయం చెదరగొట్టే వారు. తనకు మోహావేశము కల్గిన మాట నిజమే. అంత మాత్రమే. నిజమైన ప్రేమక్కూడా మోహావేశం వున్నది. ప్రణయంకూడా శారీర ప్రేమరహితమై అదోరకపు విచిత్రమైన ఉత్కృష్ట ఆశయభావమన్నా తాను నమ్మడు. భగవంతునిమీద ప్రేమా, దేశంమీద ప్రేమకూడా దేహసంబంధం కోరుతున్నాయే!

ఈ విచిత్రసంఘటన గుంటూరులో పురవిశ్రాంతి భవనంతో జరిగింది. సీతారామయ్యగారికీ, వీరయ్యకూ, కామేశ్వర్రావు హృదయం కీనీడగా, చూచాయగా గోచరించింది. వాళ్ళిద్దరూ భయపడిపోయారు. అప్పటినుంచీ ఒకరి నొకరు సంప్రదించు కోకపోయినా కామేశ్వర్రావూ, మీనాక్షీ ఏకాంతంగా వుండకుండా వాళ్ళు చూస్తూ వుండేవాళ్ళు. వీరయ్యకు తాను చెయ్యవలసినదేమిటో తోచలేదు.

పులిమీద పుట్ర అన్నట్లు కొందరు ధనవంతులు, ఒకరిద్దరు జమీందారులు వ్యంగ్యంపు మాటలతో మీనాక్షిని తమతో ఒకటి రెండు రాత్రిళ్ళుగానీ ఇంకా యెక్కువగాగానీ గడిపేటట్లుచేస్తే పదివేలదాకాకూడా బహుమతులిస్తామని కబుర్లు పంపించారు. వీరయ్య మండిపోయాడు. లోలోన క్రుంగిపోయాడు. ఈ సంగతి కామేశ్వర్రావుకు తెలియదు.

వీరయ్య సీతారామయ్యగారితో ఆవిషయం మనవి చేసుకున్నాడు. ఆయన తెల్లబోయినాడు.

**సీతా:** ఈ ప్రపంచంలో యిదో పెద్ద దురన్యాయమోయి! ఏ ఉత్కృష్ట విద్య నేర్చుకున్నా దెయ్యం నీడలా వెంటపడుతూ ఉంటుంది. ఈ దురదృష్టము. నాటకాల్లో వేషాలు వేసేవాళ్ళు. సంగీత పాటలకు గొప్పవాళ్ళ యిళ్ళల్లో వున్న స్త్రీల మోహబాణాలకు గురా? ఆడవాళ్ళువస్తే మగవాళ్ళు శుంఠలైపోవడమా? ఛీ! ఛీ!!

**వీర:** ఏమిటండీ, ఇప్పు దుపాయం? నాకు మతిపోతోంది.

**సీతా:** నావల్లే చిక్కు వచ్చిందని అనుకుంటానోయ్!

**వీర:** మా కులంలో వాణ్ణి యిట్టాంటప్పుడు మా అమ్మిణి పెళ్ళి చేసుకుంటందా సామీ!

**సీతా:** అదీ నిజమేనోయ్

**విఠలుడు:** మీరు మా అమ్మిణితో కదలేస్తురూ సామీ. మాకు దాని దగ్గిరికి వెళ్ళడమే భయంగా వుండది.

## 11

**కా**మేశ్వర్రావు జట్టునంత చెన్నపట్టణం తీసుకెళ్ళినాడు. అది 1925 వ సంవత్సరం. డిశెంబరు నెల. అడయారులో దివ్యజ్ఞాన సమాజముయొక్క షష్టి పూర్తి మహోత్సవము అఖండ వైభవంతో జరుగుతూ ఉన్నది. దేశదేశాల నుంచి సభికులు ప్రతినిధులుగా వచ్చారు. వేలకు వేలు సామాజికులూ, కానివాళ్ళుకూడా ఉత్సవాలు చూచి ఆనందించ డానికి వస్తూ వున్నారు. ఒకవైపు మహామఱ్ఱివృక్షం క్రింద సభలు. ఒకవైపు చిత్రకళాప్రదర్శనం. ఇంకోచోట బౌద్ధ, పారశీక, క్రైస్తవ, జైన, మహమ్మదీయ, యూదు, హిందూమతాదుల ప్రార్థనలు, అఖండ కోలాహలంగా వున్నది.

డాక్టరు జేమ్సు, హచ్, కజిన్సు పండితుడు భారతీయ కళావైభవ సముద్రములో మునిగి ఆనంద పారవశ్యుడైపోతూ వుంటాడు. భారతీయ కళాద్భుతానికి దూరంగా వున్న భారతీయ మహాశయులకున్ను, ఇతర దేశీయులకున్ను ఆ కళలలో ఉన్న ఉత్కృష్టత వెల్లడించడానికి సంకల్పించుకొన్నాడా మహానుభావుడు.

ఆయన ఆ ఉత్సవాలకు జావానుంచి ఒక తోలుబొమ్మలవాళ్ళ జట్టు, వీధినాటకం వాళ్ళ జట్టు రప్పించి ప్రదర్శనాలు యిప్పించాడు. ఆ ప్రదర్శనాలన్నీ కామేశ్వర్రావు మీనాక్షి వాళ్ళతోపాటు పరికించినాడు. ఆశ్చర్యపూరితుడైనాడు. అతని భావాలు ఆకాశవీధుల పరువులెత్తినవి.

ఆ మరునాడు కామేశ్వర్రావు కొందరు స్నేహితుల సహాయంతో కజిన్సుగారిని కలుసుకున్నాడు.

**కామే:** జావా తోలుబొమ్మలాట చూచానండి. ఆ ఆట ఆంధ్రదేశంనించే వెళ్ళిందని నా ఊహ.

**కజిన్సు:** కావచ్చును. ఈ రెండుదేశాల ప్రదర్శనాలకు చాలా సంబంధం వున్నమాట నిజమే.

**కామే:** ఈ ఆటలో నాటకం, నాట్యం, సంగీతం, చిత్రలేఖనము, కవిత్వము, భాష మొదలైన కళలన్నీ దివ్యంగా కలిసి వున్నాయండి.

**కజిన్సు:** జావా ఆటలో కొన్ని దోషాలు వచ్చాయి. ఆంధ్రదేశంలోని ఆటను కొన్ని దోషాలు ఆవరించాయి. కళ రానురాను హీనస్థితికి వచ్చింది.

**కామే:** మానవునిలో వున్న పశుత్వం (Atavism) ప్రతివ్యక్తి జీవితంలోను ఒకసారి పైకి వచ్చినట్లుగానే ఒక సంఘ జీవితంలో కూడా అప్పుడప్పుడు వస్తుందిగాదండి.

**కజిన్సు:** నువ్వు సరిగా చెప్పావయ్యా! ప్రేక్షక లోకంయొక్క హృదయస్థితిని బట్టి ప్రదర్శనం రీతిన్నీ మారుతూ వుంటుంది. సంఘకళా రసజ్ఞత అధోలోకంలోకి పడిపోతూ వున్నప్పుడు ఆ పతనాన్ని ఆపుచేసి నిలబెట్టే బాధ్యత ప్రభుత్వంపైనా, కళాస్రష్టలపైనా, జమీందారులపైనా, ధనికులపైనా ఉన్నది.

**కామే:** అవునండి. ఈ తోలుబొమ్మల్లోని ఉత్కృష్టత మరిచిపోయి, ఉత్తములు విముఖులవడంచేత పాటక జనులకోసం గంధోళిగాడు, కేతిగాడు, అల్లాటప్పగాడు తెరమీద విజృంభించారు. కానీ జాగ్రత్తగా చూస్తే పెద్ద పెద్ద పాత్రలకు గంభీరమైన అభినయం, చిన్న పాత్రలకు వాటికి తగిన నటన మా చిత్రంగా వుంటుందండి. రామచంద్రుడు చెయ్యి మాత్రం కదుపుతాడు. లక్ష్మణుడు తల కూడా తిప్పుతాడు. ఆంజనేయులు మొదలైనవాళ్ళు దేహమంతా కదుపుతూ అభినయం చేస్తారు. రాక్షసులు గడబిడ దడబిడగా బల్లల చప్పుడు, బూరాల మోతలతో నీడల్లా వచ్చి రూపం పొంది, మళ్ళీ పొగలా అయి మాయమవుతారు. తమ రాశీర్వదిస్తే ఉదయశంకరుడు నాట్యకళను పునరుద్ధరించినట్లున్నూ, రవీంద్రుడు నాటక కళకు కొత్త పద్ధతిగ తిరిగి జీవం పోసినట్లున్నూ, ఈ తోలుబొమ్మలాటకూడా మార్చి ఉత్తమ హృదయులు మెచ్చుకునేటట్లు చేద్దామని వుందండి.

**కజిన్సు:** మీ భావం, ఆశయం చాలాబావున్నాయి. నాకు చేతనయినంత సహాయం చేస్తాను.

## 12

**భా**రతీయ సంప్రదాయమైన చిత్రలేఖనము నేర్చుకుని ప్రసిద్ధి కెక్కిన ఒక ఆంధ్ర చిత్రకారకుని కామేశ్వర్రావు చేరదీశాడు.

వీరయ్యతో, విఠలుడితో చాలా రోజులు తర్జన భర్జన చేశాడు. తోలు బొమ్మలాట విద్యలో తాను గొప్ప మార్పులు తీసుకొస్తాననిన్నీ, అందువల్ల లోక ప్రఖ్యాతిన్నీ, మిక్కుటమగు ధనమున్నూ, వీరయ్యకు చేకూరుతాయని కామేశ్వర్రావు వాళ్ళకి నచ్చచెప్పాడు.

అప్పుచేసి ఒక అయిదువందల రూపాయలు తెచ్చాడు. అవి ఖర్చుపెట్టి పురాతన భారతీయ సంప్రదాయాలైన అజంతా, మొగలు, రాజపుత్ర పద్ధతులలో జపాను, టిబెట్టు, పారశీక, పాశ్చాత్య సంప్రదాయాలు సమ్మిళితం చేసి, నూతనంగా వచ్చే, "వ్యంజ" (Impressionism) "కోణ" (Cubism) మొదలైన రీతులను యిముడ్చుకుంటూ, కొత్తరీతులు కల్పించుకుంటూ, ఉద్భవించిన నూతన భారతీయ చిత్రలేఖన సంప్రదాయ ప్రకారంగా రామాయణ భారత కథలకు, భాగవతంలోని శ్రీకృష్ణుని కథకూ, సంధ్యాతాండవం మొదలైన శివగాథలకూ సరిపడే చిత్రాలు వీరయ్యచేత, ఆ ఆంధ్ర చిత్రకారకుని సలహాతో తయారుచేయించారు.

ఉదయశంకరుడు తన నాట్యానికి ఉపమోగిస్తూ వున్న సంగీతపు హంగు పద్ధతిని కామేశ్వరుడు అవలంబించి గొట్టు, వీణ, వాయులీన, (Violin), మహావాయులీన (Violin-cella) తంబూరా, చితారు, ఇస్రాజ్ మొదలైన వాద్య విశేషాల్ని వాయించేవాళ్ళను పోగుచేశాడు.

# 13

ఈ నూతన సంప్రదాయపు తోలుబొమ్మలాటను మొదట అడయారులో డాక్టరు కజిన్సు మొదలగు సహృదయుల మ్రోల, ఓ రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభించి ఆడింపించాడు కామేశ్వర్రావు. ఆట పన్నెండు గంటలకు పూర్తి అయింది.

రంగంలో వుండవలసిన చిత్రాలమీదే వెలుగు పడుతుంది. ఉండనక్కరలేని బొమ్మలు తెరమీద లేవు. అభినయం, నృత్యం, రసము పుట్టి పడుతున్నవి. సంభాషణ తెలుగులో చక్కని నుడికారంతో, తేనె ఊరుతున్నది. హంగుచేసే సంగీతం విచిత్రము. ఉత్కృష్ట పాత్రలు కర్ణాటక సంప్రదాయంగానున్ను, ఇతర పాత్రలు యేలపాటల పద్ధతిగానున్ను పాటలూ, పద్యాలు గానం చేసినారు. మహారాజు వస్తూ వున్నప్పుడు ఒక విధమైన సమ్మేళనగానం మహాఋషి వస్తూ వున్నప్పుడు వినిపించిన సమ్మేళన గానం వేరు. మొదటిది ప్రాపంచికాద్భుతం సూచిస్తున్నది. రెండవది పారలౌకిక భావరసాలు వుట్టిపడజేస్తున్నది.

అందరూ నిస్తబ్ధులై చూశారు.

మీనాక్షి యింత పెద్దకళ్ళు చేసుకుని కథ అంతా గమనించింది. ఆమె పేరు పొందిన సంగీత విద్వాంసురాలనన్న భావంతో తాను జట్టులో పాలుపుచ్చుకోలేదు. కామేశ్వర్రావు అందుకుని ఆమెను ప్రార్థించనూలేదు.

తాను బొమ్మలరాణి. ఇంత చిన్నప్పుడు తాను గొంతుక యెత్తడం ప్రారంభించి నప్పటినుంచిన్నీ జట్టు వాళ్ళూ, పల్లెటూళ్ళలో యితర్లూ తన్ను ఎంతో ఆదరించేవాళ్ళు. తాతగారికీ, తండ్రికి గారాలుబిడ్డ. అలాంటి తన హృదయానికి తన రాజ్యానికి మించిపోయిన మహారాజ్యం ఓటి ప్రత్యక్షమైంది. ఆమె మనస్సు ఓ విధమైన వాంఛామేఘంలో అలుముకుపోయింది. అన్నీ సుళ్ళు చుట్టిపోయే ఆలోచనలే. అంతలో భయం.

తాను సంగీతంలో సేలం గోదావరిలా, బెంగుళూరి నాగరత్నంలా పేరు సంపాదించుకోవచ్చును. అది ఆఖరుకాదుకదా యీవాళనుంచి? కామేశ్వర్రావు మళ్ళీ తోలుబొమ్మలాట మొదలుపెట్టించాడేమి? ఎంతబాగున్నా తోలుబొమ్మలాట మళ్ళీ వద్దు.

ఆమెకు గాడిద లద్దెలవాసనా, ఏళ్ళ తరబడి చెమటలో తడిఆరిపోయిన, భయంకరమైన ఛండాలపు మురికి గుడ్డల వాసన మళ్ళీ కొట్టినవి. ఒళ్ళు జలదరించింది. కళ్ళనీళ్ళు తిరిగినవి. ఆ నరకంలోంచి రక్షించిన దైవసమానులు సీతారామయ్యగారు, కామేశ్వరర్రావుగారు. వాళ్ళు మళ్ళీ అధోలోకంలోకి తన్ను తోసివెయ్యరుకదా! అమ్మయ్యో!!

ప్రదర్శనం అయిన మర్నాటి నుంచి కామేశ్వర్రావును చూడ్డానికి ఆమెకు భయం వేసింది. ఒకనాడు కామేశ్వర్రావు ఆమె దగ్గరకు వచ్చాడు.

ఆమె మంచంపైన మెత్తని దిండులోకి మొహందూర్చి తలయెత్త కుండా పడుకుంది. కామేశ్వర్రావు గదితలుపు చేరవేశాడు. ఆ బాలిక దేహ సౌభాగ్యకాంతులు, ఆనందరేఖల వంపులుపోతూ, ఆ సన్నని తెల్ల పట్టు చీరలోనుంచి ప్రతిఫలిస్తున్నవి. ఆమె యౌవనము పూర్ణతదాల్చి ఆమె సౌందర్యానికి యింకా వన్నె తెచ్చింది. కామేశ్వరుని హృదయము

వెర్రి ఆశలో మునిగినది. ప్రేమపూర్ణతచే అతడు తూలుతూపోయి మంచంపై పడుకుని వున్న మీనాక్షిపై సుందరేశ్వరునిలా వాలాడు. ఆమెను తన బాహువుల్లోకి మింగి వేసుకొన్నాడు. ఆమె కర్కశత్వముదాల్చి అతని బాహువుల్లో కట్టెవలే బిగుసుకొనిపోయింది.

కామేశ్వర్రావు ఆశ్చర్యపడి,

"మీనా! నే నంటే నీ కాపేక్షలేదా?" అన్నాడు.

"....................."

"ఈ మూడేళ్ళనుంచి నా హృదయంలో ఒక దేవాలయం కట్టుకుని అందులో నిన్ను పెట్టి పూజచేస్తున్నాను. ఆ రోజున మా ఊళ్ళో బొమ్మలాటలో నీ గొంతుకు విన్నప్పటినుంచీ–"

కామేశ్వర్రావు తన కౌగిలింతలోంచి ఆమెను వదలి ప్రక్కన కూర్చున్నాడు.

"ఆనందంలేని నా జన్మకు ఆనందం యిచ్చావు, మీనూ! నీ ప్రేమ అనే అమృతంతో నన్ను దివ్యుణ్ణి చేశావు.

మీనాక్షి లేచి కూర్చుంది.

"ఈ కొత్త బొమ్మలాటలోకి నన్ను దింపుతారా యేమిటి నాయుడుగారు?"

"మీనూ, మీనూ! నా కుటుంబం యావత్తూ వదిలివేశా. నా తల్లినీ, వాళ్ళనూ చూసి యేడాదయింది. నీ దాసాన దాసుణ్ణి. నా ఈ జన్మ భయంకరమైన వట్టి ఎడారి చేసినా, పరమ పవిత్రాలైన హిమాలయ భూములు చేసినా నీ చేతిలోనే వుంది."

కామేశ్వర్రావు మంచము దిగి ఆమె పాదాలకడ మోకరిల్లి ఆమె వళ్ళో తలపెట్టుకుని ఆమె నడుంచుట్టూ తన రెండుచేతులూ చుట్టి "నా జన్మం పవిత్రం చేసిన దేవిని ఉద్భవించుకున్న నాకు కృపావరము దొరకదా?" అని అన్నాడు.

మీనాక్షి దృగంచలాలనుండి వేడిచుక్కలు కామేశ్వర్రావు తలపై పడ్డాయి.

"మీరు అద్భుతమైనటువంటి నూతన ప్రపంచంలోనికి తీసుకువచ్చినారు నన్ను. గడ్డిపోచను దవనపు మొక్కగా చేశారు. నా చర్మం మీకాళ్ళకు జోళ్ళుకుట్టి యిచ్చినా నా బాకీ తీర్చుకోలేను."

"ఒట్టి బాకీయేనా?"

కామేశ్వర్రావు చటుక్కునలేచి ఆమె బుజాలమీద తన రెండు చేతులూవేసి ఆమె వేపుకు దీనంగా చూస్తూ ప్రశ్నించాడు. ఇంతలో తలుపు తోసుకొని వీరయ్య, కామేశ్వర్రావు మేనమామ సీతారామయ్యగారు లోపలికి వచ్చారు. కామేశ్వర్రావు నిర్ఘాంతపోయాడు. మేనమామ అతికోప కంఠంతో "యేవిరా, కాముడూ! చదువుకున్నందుకు యిదేనా యేంటి? కులం తగలేస్తున్నావు. కుటుంబం తగలేస్తున్నావు. మా అప్ప కుళ్ళికుళ్ళి మంచం పట్టింది. మేం పదిమందిలో తలెత్తుకొని తిరగలేకుండావున్నాం. అప్పులుచేసేసి తమ్ముణ్ణీ నిన్ను కూడా తగలేసుకుంటున్నావ్. నీ కొచ్చిన సంబంధాలవాళ్ళకి జవాబులు చెప్పలేకుండా సచ్చిపోతున్నాం. అనంతపురం డిప్యూటీ కలక్టరుగారు పిల్లనిస్తామని నాతో కూడా వచ్చారు. ఆయన పెద్దహోటలులో వున్నారు. రా, అక్కడికి పోదాం. నీ మూటా ముల్లీ సర్దుకో. మనం భీమవరం వెళ్ళిపోదాం లెగు."

**సీతా:** నాయనా! వీరయ్య తన గొడవ తను చూసుకుంటాడు. అతనిపై దయవుంచి ఇహ ఒదిలెయ్యమంటున్నాడు. నీ ధర్మం నువ్వు ఆలోచించుకో.

**వీర:** కామేశ్వర్రావు బాబుగారూ! మీరు మాకు చేసిన ఉపకారానికి మేం యెన్ని జన్మలెత్తినా మీకు సేవజేసినా కృతజ్ఞత తీర్చుకోలేమండి. మా తమ్ముడి కూతురు కొడిక్కి సామీ మా అమ్మణ్ణిని యివ్వడానికి సంబంధం యేర్పాటు చేసినా. మేం అంతా వరంగలెడుతుండము.

కామేశ్వర్రావు తుపాకుల యెదుట సింహంలా చుట్టూ తేరిపార చూశాడు. మాట జవాబు చెప్పకుండా అతి కోప స్వరూపంతో మూడు అంగల్లో గుమ్మందాటి విసవిస వెడలి మాయమయ్యాడు.

## 14

**ఆ**నాటి సాయంత్రము మీనాక్షి మాయమయింది. రెండురోజులైన వెనుక బెంగుళూరులో మీనాక్షి, కామేశ్వర్రావులకు వివాహం అయిందని పత్రికలలో ప్రచురణం అయింది. చెన్నపట్టణంలో బెంగలు పెట్టుకుని తిండి మానేసుకున్న వీరయ్య జట్టుకు సీతారామయ్యగారు నెమ్మదిగా ఈ వార్త వినిపించాడు. విఠలుడి మోము ప్రఫుల్లమైంది. వీరయ్య విషాదంతోనూ, కోపంతోనూ కూలబడిపోయాడు.

ఈ వార్త విని కామేశ్వర్రావు మేనమామ మాహాగ్రహంతో కామేశ్వర్రావుని బండబూతులు తిట్టుకున్నాడు.

సీతారామయ్యగారూ, కామేశ్వర్రావుగారి మేనమామా భీమవరం తిరిగి వెళ్ళిపోయారు.

ఒకరోజు తెల్లవారేసరికి వికసించిన గులాబిపువ్వు మోముతో మీనాక్షీదేవి తాతగారి దగ్గరకు వచ్చి నమస్కారంచేసింది. ఆమె పెదవులు చిరునవ్వు నవ్వుతున్నవి. ఆమెకళ్ళు చిరుభయంతో బెదురుతున్నవి. ఆమె ఫాలంలో ముంగురులు చిరుగాలిలో చెదురుతున్నవి. ఆమె వాక్కులు చిరు కంపంతో తొణుకులాడినవి.

"నీ మొహం చూడకూడదు, అమ్మిణీ!"

"............."

"నువ్వెంత పాపంచేశావో నీకు తెలుస్తుందా?"

"................."

"నీకు పుట్టిన కొడిక్కి నా పేరు పెట్టుకోకు."

"తాతయ్యా, నీకు దణ్ణం పెడదామని అవతల నుంచుని ఉన్నారు. కామేశ్వర్రావుగారు ఒక దేవుడు."

కొత్త పద్ధతిలో అద్భుతమైనటువంటి అజిన చిత్రనాటక ప్రదర్శనం మ్యూజియమ్ నాటక ప్రదర్శనశాలలో జరుగునని చెన్నపట్టణంలోని పత్రికలన్నీ ప్రచురించాయి. ఆ ప్రదర్శనంలో బొమ్మలరాణి మీనాక్షిదేవికూడా పాలుగొంటుందనిన్నీ, ఇంత విచిత్రమగు ప్రదర్శనం భారతదేశంలో యిది వరకు చూపించలేదనిన్నీ, ఈ ప్రదర్శన సూత్రధారుడైన

కామేశ్వర్రావుగారు చాలా అభినందింపబడతగినవాడనిన్నీ మొదలైన సంగతులతో, జట్టులో పాల్గొనేవాళ్ళ ఛాయాచిత్రాలతో పత్రికలు వ్యాసాలు ప్రకటించినవి. ప్రదర్శనము శ్రీగవర్నరుగారి అధ్యక్షతను జరిగింది. చూచినవాళ్ళంతా సంతోషంతో విస్తుపోయినారు. పదకొండు వందలరూపాయల టిక్కట్లమ్మబడినవి.

నాటకంలో ఉన్న అందం, సినిమాటాకీలో ఉన్న అందం, చిత్రకళా ప్రదర్శనంలో ఉన్న అందం కలవేసి యీ నవీన పద్ధతి రూపొందిందని పండితులు వ్యాసాలు వ్రాశారు.

ఓనాడు ఉదయాన్న కామేశ్వర్రావు భార్యతో భీమవరంలో తన ఇంటి దగ్గర మోటారునుంచి దిగినాడు. బెంగచే కృశించి తల్లి మంచంపట్టి ఉన్నది. ఇంతలో మెరుపు తీగలాంటి ఒక బాలిక ఆమె పాదాలకడ వాలి, పాదములపై తలవుంచి, పాదాలు పట్టుకుంది. కామేశ్వర్రావు తల్లి నెమ్మదిగా లేచి "యెవరమ్మా నువ్వు?" అని ఆ బాలిక తలపట్టుకుని యెత్తి మోము తేరిపారచూచింది.

"నువ్వెవరు, తల్లీ?"

ఆ బాలిక కన్నుల జలజల బిందులు రాలిపోతున్నవి.

"నువ్వు దేవతాకన్నెవు కాదుగదా."

వర్షం కురుస్తూన్నప్పుడు వచ్చే వెన్నెలలా ఆ బాలిక పెదవులు నవ్వాయి.

కామేశ్వర్రావు తల్లి "నా బంగారుతల్లి నువ్వెవ్వరో తెలియలేదు నాకు" అని ఆ బాలికని దగ్గరకు లాగుకొని హృదయానికి అదుముకున్నది.

ఇంతలో గుమ్మము కడ నిలుచుని వున్న కామేశ్వరరావు "అమ్మా! మీ ఆజ్ఞలేకుండా సంచరించిన ఈ అధముణ్ణి క్షమించి మా ఇద్దర్నీ దీవించవూ?" అన్నాడు.

ఆవిడకు హృదయం పొంగింది.

"నాయనా! ఈ దేవకన్నేనా నా కోడలు? బొమ్మలాట వాళ్ళ పిల్లలంటే యానాదుల అమ్మాయిలా వుంటుందనుకున్నాను. ఈమె శాపంచేత పుట్టిన ఇంద్రుడు కూతురురా!"

కామేశ్వర్రావూ, మీనాక్షి ఆమె పాదాలకడ మోకరిల్లారు. ఆ తల్లి కొడుకూ, కోడళ్ళ తలలమీద రెండుచేతులూ వుంచి తలయెత్తి "శ్రీరాములూ, వీళ్ళిద్దర్నీ రక్షించు!" అన్నది.